ప్రజాశక్తి

శుక్రవారం 7 ఏప్రిల్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

చిలకలూరిపేటకు సిఎం వరాలు

- మున్సిపాల్టీకి మరో రూ.63 కోట్లు మంజూరు
- ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు అంగీకారం
- సామాజిక తరగతుల వారీగా భవనాల నిర్మాణానికి హామీ
- ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సిఎం సుదీర్ఘ ప్రసంగం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

చిలకలూరిపేట నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు వరాలు ప్రకటించారు. గురువారం చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభం సందర్భంగా జరిగిన సభలో మంత్రి విడదల రజనీ పలు సమస్యలను సిఎం దృష్టికి తెచ్చారు. వీటికి స్పందించిన సిఎం తన చెల్లి మంత్రి రజిని చిలకలూరిపేట అభివృద్ధికి కొన్ని పనులు అడిగిందని, ఆమె విజ్ఞప్తి మేరకు పలు పథకాలను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రూ.150 కోట్లతో తాగునీటి కోసం పనులు జరుగుతున్నాయని, ఇందుకు గాను మున్సిపాల్టీకి మరో రూ.63 కోట్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. అంబేద్కర్ కమ్యూనిట్ హాల్, బిసి భవన్, కాపు భవన్‌లనూ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ముస్లిమ్ శ్మశానం, దర్గా నిర్మాణం కోసం 3 ఎకరాలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పలు ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు.

అంతకు ముందు ఆయన రాష్ట్రంలో వైద్య రంగంపై సుదీర్ఘంగా ప్రసంగించి ఫ్యామిలీ డాక్టర్ విధానంపై వివరించారు. పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా ఇస్తూ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని అన్నారు. ప్రజలకు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని డాక్టరే మీ గ్రామానికి, మీ ఇంఇకే వస్తారని, వైద్యులతో పాటు వైద్య సేవలు కూడా వస్తాయని చెప్పారు. మందులు కూడా మీ దగ్గరకే వచ్చే గొప్ప కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్ విధానం అని చెప్పారు. వైద్య పరీక్షల కోసం ఎక్కడికో వెళ్లకుండా ఇంటి వద్దనే వీటిని చేస్తారని తెలిపారు. ఆధునిక వైద్యాన్ని మీ గ్రామం వద్ద ఉచితంగా అందించడానికే ఈ విధానం తెచ్చామన్నారు. జబ్బులు రాకుండా.. వచ్చినా ముదరకుండా కాపాడేందుకు ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తెచ్చామని, బీపీ, షుగర్‌లకు మాత్రమే కాకుడా కేన్సర్ దగ్గర నుంచి గుండె జబ్బులు, టీబీ వరకూ ప్రతిపేదవాడికీ ఒక రక్షణ చక్రం ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మొదలవుతుందని అన్నారు.

ప్రతి 2 వేల జనాభాకు గ్రామంలోనే ఒక వైయస్సార్ విలేజీ క్లినిక్ స్థాపించామని, ఇందులో ఒక బీయస్సీ నర్సింగ్ చేసిన వ్యక్తి అక్కడే సీహెచ్‌ఓ (కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్)గా మిడ్ లెవల్ హెల్త్ ప్రాక్టీసనర్ అక్కడే ఉంటారని తెలిపారు. ఈ సీహెచ్‌ఓకు అదనంగా ఇందులోనే మరో ఎఎన్‌ఎం కూడా అందుబాటులో ఉంటాని, వీళ్లిద్దరే కాకుండా ఆశా వర్కర్లు అందరూ విలేజ్ క్లినిక్‌కే రిపోర్టు చేసే వ్యవస్థ గ్రామంలో రూపొందించామని చెప్పారు. వైద్యులు నెలకు రెండు నుంచి నాలుగు సార్లు అదే గ్రామానికి వచ్చి వైద్యం అందిస్తారని, దీనివల్ల ఆ డాక్టరుకు ఆ గ్రామంలో ఉన్న ప్రతి వ్యక్తితోనూ పేరు, పేరునా పిలిచే పరిచయం ఏర్పడుతుందని అన్నారు.

వైద్య సిబ్బందితో మాటామంతి..

ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభం నిమిత్తం లింగంగుంట్ల వచ్చిన ఆయన వైద్యులు, సిబ్బందితో ఎక్కువ సేపు మాట్లాడారు. ఈ విధానం ఎంత వరకు అర్థం చేసుకున్నారో వారిని వివిధ

▶ 2లో



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సభకు హాజరైన జనం, వైద్య సిబ్బంది



8న తిరుపతికి వందేభారత్ రైలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 8వ తేదీన సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ గురువారం సాయంత్రం మీడియాకు తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు సికింద్రాబాద్‌లో ప్రారంమవుతుందని, 3.35కు గుంటూరు స్టేషన్‌కు వస్తుందని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలు కేవలం 8.30 గంటల్లోనే సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తుందని చెప్పారు. గుంటూరులో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రైలులో మంచి సదుపాయాలు ఉంటాయని, రైలఅంతా సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్లలో హాల్ట్ ఇచ్చారు. పిడుగురాళ్లలో మధ్యాహ్నం 2.30 గంటలకు, గుంటూరులో 3.35 గంటలకు, తెనాలిలో సాయంత్రం 4.15 గంటలకు, బాపట్లలో 4.50 గంటలకు రైలు ఆగనుంది.

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ 14 నుండి వామపక్షాల ప్రచారోద్యమం

5లో

మతి స్థిమితం లేని యువతిపై లైంగిక దాడి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మతిస్థితిమితం లేని యువతిపై దుండగుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని గోగులమూడిలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాధిత యువతి కొద్దిరోజుల కిందట గేదెలను మేపడానికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన కారంపూడి లచ్చం సుబ్బారావు అనే వివాహితుడూ గేదెలను మేపడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆమెపై లైంగిక దాడి చేశాడు. యువతి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తల్లి ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితురాలి తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుడు పరారిలో ఉన్నట్లు తెలిపారు. ప్రత్తిపాడు సిఐ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా పదో తరగతి హిందీ పరీక్ష

గుంటూరులో 99.34, పల్నాడులో 99.03 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో గురువారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 99.34 శాతం హాజరు నమోదైంది. 26,382 మందికిగాను 26,219 మంది హాజరయ్యారు. 163 మంది గైర్హాజరయ్యారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు 32 కేంద్రాలను, డిఆర్‌ఒ ఒక కేంద్రాన్ని, డిఇఒ 5 కేంద్రాలను సందర్శించారు. మధ్యాహ్నం నిర్వహించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు 8 సెంటర్లలో 1744 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్‌కు 14 పరీక్షా కేంద్రాల్లో 3352 మంది హాజరయ్యారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో 99.03 శాతం హాజరు నమోదైంది. 24305 మంది హాజరు కావాల్సి ఉండగా 24084 మంది హాజరయ్యారు. 221 మంది గైర్హాజరైనట్లు డిఇఒ శ్యామ్యూల్ కుమార్ తెలిపారు. 126 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 45 సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసరా వేడుకలకు గ్రామైక్య సంఘాల నుంచి వసూళ్లు

4లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.27

సహరీ (శనివారం ఉదయం) : 4.41

చిలకలూరిపేటకు సిఎం వరాలు

(మొదటి పేజీ తరువాయి)

రూపాల్లో అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఎఎన్ఎంలను సిఎం పలుప్రశ్నలు అడిగి సమాచారం రాబట్టారు. కొన్ని సందేహాలకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుతో సమాధానాలు ఇప్పించారు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలు, పాఠశాల విద్యార్థులు, వృద్ధులతో ఆయన ముచ్చటించారు.

జగన్.. రజిని ఫొటోలు మాత్రమే..

సిఎం జగన్ పర్యటన సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో మంత్రి విడుదల రజిని అనుచరులు ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీల్లో పల్నాడు జిల్లా నాయకులు, మంత్రుల ఫొటోలు కన్పించలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్లు, ఫొటోలు లేకుండా కేవలం సిఎం జగన్, మంత్రి విడదల రజనీ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వైసిపి వర్గాల్లో చర్చనీయాంశంమైంది.



అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు: శ్రీ రామ నవమి సందర్భంగా కొరిటెపాడు సాకేతపురంలోని సాకేత రామాలయంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం, శ్రీ సీతా రామాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటలకు కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి ఎస్.ఎం. సుభాని కవి సమ్మేళనం నిర్వహించగా, డా.ఎం.లలితకుమారి, ఈవూరి వెంకట రెడ్డి, గాడేపల్లి మల్లికార్జునుడు, నానా, చుండూరు శేషమాంబ, తాటికొల పద్మావతి, యెక్కంటి పద్మావతి, పి. బలరాం, దారివేముల అనిల్ కుమార్, పి. దుర్గాదేవి పాల్గొని రామాయణంలోని అనుబంధాలపై మరియు పలు అంశాలను కవితాగానం చేసారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు కాకి శ్రీనివాసరావు దంపతులు కవులను శాలువా , ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బుర్రి కుమార్ రాజు కూడా పాల్గొన్నారు.



టిజెపిఎస్‌లో ముగిసిన స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో గత మూడు రోజులగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ గురువారం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ ఏబిపి మనోహర్ తెలిపారు.కబడ్డీ ఫైనల్స్, వాలీ బాల్ ఫైనల్స్, షటిల్ ఫైనల్స్, అతెలిటిక్స్‌లో 100 మీటర్స్ రన్నింగ్, షార్ట్ పుట్ విభాగాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులలో ఉన్నటువంటి క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడం కోసం ప్రతి ఏడాది కళాశాల యాజమాన్యం ఇటువంటి ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.క్రీడల వలన విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, మనోస్థైర్యం, కష్ట పడి పోరాడే తత్త్వం అలవడతాయని చెప్పారు. పి.జి. ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్.అనితాదేవి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడా రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరిగిందని, వివిధ విభాగాలలో నైపుణ్యం కలిగిన క్రీడా కారులను గుర్తించి యూనివర్సిటీ స్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ టీం డాక్టర్.జె.వి. సుధీర్ కుమార్, మేజర్, కుమార్ రాజు, డాక్టర్.రవి కుమార్, శ్రీ. చంద్ర శేఖర్,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

సిఎం సభలో మంత్రి విడదల రజని భావోద్వేగం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో రోజు రోజుకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు నాయుడు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. చిలకలూరిపటలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభ సభలో ఆమె మాట్లాడుతూ 2007లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ రూప కల్పన చేస్తే, వారి తనయులు నేడు 2023లో ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీ స్ఫూర్తితో అంత కన్నా మెరు గైన రీతిలో పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. లింగంగుంట్ల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బిసి మహిళ అయిన తనను ఆదరించి మంత్రిగా చేసినందుకు ఏమీ ఇచ్చి రుణం తీర్చుకోగలనని ఆమె భావోద్వేగానికి గురై. కన్నీటిపర్యంతం అయ్యారు. జగన్మోహన్ రెడ్డికి జీవిత మంతా రుణపడి ఉండటమే కాకుండా నిజాయితీగా పని చేస్తానన్నారు. చంద్రబాబు ఎమ్మెల్యేను కొనగలడేమో కానీ జగన్మోహన్ రెడ్డికి వున్న నాలుగు కోట్ల ప్రజలను, ఆయన కార్యకర్తలను కొనలేడాన్నారు. 2024లో ఓడి పోవడానికి సిద్ధంగా ఉండాలని విమర్శించారు. సభకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ స్వాగతం పలికారు. ఎస్‌పిఆర్ కెటి స్కూల్ విద్యార్థినులు ప్రభుత్వ పథకాలనుద్దేశించి చేసిన కళా, నృత్య రూపాలు ప్రేక్ష కులను అలరించారు





సిఎం సభలో మాట్లాడుతున్న విడదల రజని, నివాళులర్పిస్తున్న సిఎం. జగన్,హెన్రీక్రిస్టినా

పది పరీక్షా కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు : నగరంలోని పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో పదో తరగతి పరీక్ష రాసే యాదవ హైస్కూల్‌లో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పి ఆరిఫ్ హఫీజ్ ఐపిఎస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పరీక్ష జరిగే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ , ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పరీక్షకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది, వ్యక్తులు గానీ ఉండకుండా చూడాలని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి విమర్శలకు తావులేకుండా సమర్ధవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారుల, సిబ్బందిని ఆదేశించారు. విధులు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తో మాట్లాడి పరీక్ష జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు. పరిసర ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటామని, విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు విద్యార్థులు పాల్పడిన, అలాంటి వారికి ఎవరైనా సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారుజిల్లా వ్యాప్తంగా ఎదైనా పరీక్షా కేంద్రం వద్దనైనా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే 100కు లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 8688831568కు సమాచారం అందించాలని ఎస్పి కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు సిఐ సుబ్బారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాసరావు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పి ఆరిఫ్ హఫీజ్



అభివృద్ధిపనులను పరిశీలిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, మద్దాలి

చుట్టుగుంటకు మహర్దశ

అభివృద్ధి పనులను పరిశీలించిన అప్పిరెడ్డి,మద్దాళి గిరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు చుట్టుగుంట జంక్షన్‌కు అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. శరవేగంగా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే మద్దాళి గిరి, జిడిసిసి బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతితో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి గురువారం పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, గుంటూరు సమగ్రాభివృద్ధి సాధనే తన సంకల్పమని వెల్లడించారు. అందులో భాగంగానే నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ళలో ప్రగతి పనులపై దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని నందనవనంలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పారు. తన నియోజకవర్గంలోని అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఒకటైన చుట్టగుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే చుట్టుగుంట జంక్షన్ పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన చెప్పారు.

ముందస్తు పన్ను చెల్లింపులకు 5శాతం రాయితీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పన్నులను ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెనాలి పురపాలక కమిషనర్ ఎం. జస్వంత్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తేదీ 1-4-2023 నుండి 31-03-2024 వరకు ఇంటి పన్నులు చెల్లించాల్సిన వినియోగదారులు పన్నులు చెల్లిస్తే రాయితీ పొందవచ్చని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 9.00 నుండి సాయంత్రం 6.00 గంటలు వరకు నేరుగాగాని ఆన్ లైన్ విధానం ద్వారా పన్నులను చెల్లించవచ్చని సూచించారు.



నాదెండ్ల మనోహర్‌ను గజమాలతో సత్కరిస్తున్నఅభిమానులు

ఘనంగా నాదెండ్ల మనోహర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్: జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పుట్టినరోజు వేడుకలను తెనాలి జనసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ పీఏసీ సభ్యులు పలు జిల్లాల నగర అధ్యక్షులు రాష్ట్ర, జిల్లాల కార్యవర్గం సభ్యులు, నియోజకవర్గాల ఇంఛార్జులు నాదెండ్ల మనోహర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన కేక్‌ను మనోహర్‌తో కట్‌చేయించారు. పలు వృద్ధాశ్రమాల్లో కార్యకర్తలు అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. తెనాలి నియోజకవర్గ నాయకులు బండారు రవికాంత్, ఇస్మాయిల్ బేగ్, తోటకూర వెంకట రమణారావు, జాకిర్ హుస్సేన్, పి.మురళీ కృష్ణ తదితరులు భారీ గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దివ్వెల మధుబాబు,పి.వెంకట నరసమ్మ, విజయలక్ష్మి పాల్గున్నారు



తాడికొండ



మేడికొండూరు

ఫ్యామిలీ డాక్టర్ వైద్యం పేదలకు వరం

ప్రజాశక్తి - తాడికొండ

ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం పేద ప్రజలకు కానుక అని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కంతేరు, నిడుముక్కల గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని తెలిపారు.జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విలేజ్ క్లినిక్ విధానాన్ని అందరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ శరవణ్ బాబు, తహసిల్దార్ ఫణీంద్ర బాబు, ఎంపీడీవో మహేష్ ,సర్పంచ్ మహేష్ బాబు, సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఎంపిటిసి బోడపాటి సుశీల, డిఎంహెచ్ఓ శరవణ్ బాబు, తహశీల్దార్ ఫణీంద్ర బాబు, ఎంపీడీఓ మహేష్, సర్పంచ్ మహేష్ బాబు, పాల్గొన్నారు. **మేడికొండూరు:** గ్రామాల్లో ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతోనే వైసిపి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిందని మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న అన్నారు. మండలంలోని విశదల గ్రామంలో గురువారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విలేజ్‌క్లినిక్‌ను ముఖ్య అతిథిగా హాజరై ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం విద్యా, వైద్యం రంగాలలో ఎక్కువ బడ్జెట్ కేటాయించి పలు రకాల అభివృద్ధి సమీకరణలు చేపట్టిందన్నారు. విలేజ్ క్లినిక్ ను ప్రతి ఒక్కరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మధ్య వయసు దాటిన వారు తప్పకుండా బిపి షుగర్లను ఉచితంగానే ఈ కేంద్రాలలో టెస్టులు చేస్తారని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం శోభారాణి, గ్రామ నాయకులు మామిడి సీతారామయ్య, పాల్గొన్నారు. **ఫిరంగిపురం:** స్థానిక మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఎంపిపి షేక్ షహేల నర్గీస్ సలీం ఫ్యామిలీ ఫిజీషియన్. కాన్సెప్ట్ క్లినిక్‌ను గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరూ ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాలతో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సిహెచ్ యాని గ్రేస్ సిహెచ్ఓ వెంకటలక్ష్మి ,ఎంపిహెచ్ ఈఓ. లూర్దు రాజు ,ఏఎన్ఎంలు, ఆశా వర్కరు, సర్పంచ్, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవో 45పై కొనసాగుతున్న రాజధాని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణానికి సమీకరించిన 1,134 ఎకరాలను రాజధానేతర ప్రాంత వాసులకు ఇళ్ళ స్థలాలుగా ఇచ్చేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో 45 పై రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుధవారం వెలగపూడిలో రైతు జెఎసి నాయకులు జీవో 45 పై ఆందోళన వ్యక్తం చేయగా గురువారం తుళ్లూరులో రైతులు ఆందోళన బాట పట్టారు. అనంతవరం, తుళ్లూరు, మందడం, రాయపూడి గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు తుళ్లూరు రైతు దీక్షా శిబిరం దగ్గర నుంచి టిడ్కో గృహ సముదాయాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అక్కడ నుంచి పక్కనే ఉన్న పొలాల వద్దకు వెళ్ళి జీవో 45కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి దళిత మహిళా జెఎసి కన్వీనర్ అంకం సువర్ణ కమల మాట్లాడుతూ రాజధానిలో పేదల ఇళ్ళ నిర్మాణాలకు 5 శాతం భూములు కేటాయించారే తప్ప స్థలాల పంపిణీకి కాదన్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలన్నారు. గత ప్రభుత్వం ఫేజ్ 1 కింద 5,034 టిడ్కో గృహాలను నిర్మించడం జరిగిందని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా వైసిపి ప్రభుత్వం వాటిని పేదలకు పంపిణీ చేయలేకపోయిందని అన్నారు. ఇళ్ళు అప్పగించడం చేతగాదు.. స్థలాలు ఇస్తామంటూ హడావిడి చేయడం వెనుక ప్రభుత్వం కుట్ర దాగుందని అన్నారు. తాము ఇళ్ళ స్థలాలు ఇస్తామంటే రైతులు అడ్డుకుంటున్నారని విష ప్రచారం చేసి రాష్ట్రం లోని పేదల ఓట్లు కొల్ల గొట్టే ఎత్తుగడని అన్నారు. ముస్లిం మైనారిటీ జెఎసి కన్వీనర్ షేక్ సాహెబ్ జాన్ మాట్లాడుతూ, అమరావతి ఎడారి, స్మశానం, అక్కడ ఖర్చు పెట్టే ప్రతి రూపాయి గోతిలో పడేసినట్లే అని చెప్పిన పాలకులు ఇప్పుడు పేదలకు రాజధానిలో ఇళ్ళ స్థలాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ముందు రాజధాని ప్రాంతంలోని పేదలందరికీ ప్రభుత్వం ఇళు ్ళ నిర్మించాలన్నారు. రాజధాని లోని ఏ ఒక్క రైతు పేదలకు వ్యతిరేకం కాదన్నారు. కోర్టులో ఉన్న అంశంపై ప్రభుత్వం మొండిగా ముందుకు వెళుతోందని అన్నారు. రైతులు దుర్గా, వరలక్ష్మి, ఆలూరి యుగంధర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని పేదల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వం ఇతర ప్రాంతాల పేదలను ఉద్ధరిస్తానని చెప్పడం ఓట్లు కొల్లగొట్టే ఎత్తుగడ తప్ప మరేమీ కాదన్నారు. కాగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు చేస్తున్న దీక్షలు గురువారంతో 1206 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు సాగాయి.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.



తుళ్లూరులో రైతుల ఆందోళన



వివరాలు వెల్లడిస్తున్న డిఈఈ బి.వెంకటేశ్వరరెడ్డి

విద్యుత్ చౌర్యంపై కేసులు

ప్రజాశక్తి-ఈపూరు

నరసరావుపేట రూరల్ పరిధిలోని రొంపిచర్ల, ఈపూరు మండలాల్లో విద్యుత్ విజిలెన్స్ ఆపరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ సర్వీసులను విస్తృత తనిఖీలు చేసినట్లు డిఈఈ బి వెంకటేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. ఈ తనిఖీలలో మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 51 మందికి రూ.0.822 లక్షలు, మీటర్ ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఎనిమిది మందికి రూ.1.50 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుతున్న ఆరుగురికి రూ.0.225 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 44 మందికి రూ.1.11 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం లోబడి ఉంటాయన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై అపరాధ రుసుం విధించడంతోపాటు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఈ దాడులలో డిఈఈ కె రవికుమార్, ఎమ్ రవికుమార్, వై ఏడుకొండలు, ఏఈ కె కోటేశ్వరరావు, కె రాంబాబు, ఎపిటిఎస్ ఎస్ఐ పెద్దబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



బొక్కా రవి (ఫైల్ ఫొటో)

గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన బొక్కా రవి (35) మృతి చెందగా అదే గ్రామానికి చెందిన మోడీ రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు సిఎంఆర్ షాపింగ్ మాల్ లో సేల్స్ మెన్స్‌గా పనిచేస్తున్న రవి, రమేష్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని స్కూటీ పై సత్తెనపల్లి వస్తుండగా మార్గమధ్యంలో చేగు డాబా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బొక్క రవి అక్కడికక్కడే మృతి చెందగా రమేష్ తలకు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడు రవి కి భార్య అరుణ, ఆరు నెలల పాప ఉంది. రావి మృతి వార్త వినడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డిన రమేష్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ జలాశయంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక కృష్ణవేణి పుష్కరఘాట్ వద్ద కృష్ణా జలాశయంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. సమాచారం అందుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ పి.అనిల్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై జపమాల, కట్ డ్రాయర్ ఉన్నాయని, నది ఒడ్డున పింక్ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్, కాఫీ కలర్ టోపి, చెప్పులు ఉన్నాయని తెలిపారు. మృతుడు సాగరమాత దేవాలయానికి మొక్కుబడి చెల్లించు కునేందుకు వచ్చి స్నానం చేసేందుకు కృష్ణానదిలో దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని పోలీసులు భావి స్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ళు ఉంటుంది. ఎస్ఐ అనిల్ కుమార్ రెడ్డి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

అనుమానాస్పద స్థితలో వృద్ధుడు మృతి



ప్రజాశక్తి-తెనాలి:రూరల్ గ్రామం కఠెవరంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో, వారు వృద్ధుని వద్ద లభ్యమైన అధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా నిడమానూరుకు చెందిన వృద్ధుడు గొల్లపూడి భాస్కరరావు(73) కఠెవరం గ్రామంలో పంచాయతి బల్లపై మృతిచెంది ఉన్నాడు. పక్కనే పురుగు మందుల డబ్బా ఉండటం, నోటి నుంచి నురుగ రావటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వృద్ధుడి భార్య దాదాపు 30 ఏళ్ళ క్రితమే చనిపోగా, ఓ కుమార్తె కూడా ఇటీవలే మరణించింది. మరో కుమార్తెకు భర్తతో విబేదాలున్న నేపథ్యంలో భాస్కరరావు అక్కడ వృద్ధాశ్రమాల్లో కాలం వెళ్ళదీస్తున్నాడు. పాల్వంచ వృద్ధాశ్రమంలో ఉంటున్న ఆయన మూడు రోజుల క్రితం ఆశ్రమం నుంచి బయటకు వచ్చేశాడు. బుధవారం రాత్రి కఠెవరం చేరినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి మృతదేహాన్ని తీసుకువెళ్ళారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

భార్య మృతితో భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-తెనాలి:భార్య మృతి చెందిన విషయం తెలుసుకున్న భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు, కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని మారీసుపేట రెండు గేట్ల మధ్య నివిసించే తాడిబోయిన చంద్రశేఖరసాయి(24), వెంకటలక్ష్మీ భవాని(24) భార్యాభర్తలు. వీరికి ఏడాది నాలుగేళ్ళ వయసున్న కుమార్డు, ఏడాది వయసున్న కుమార్తెలు(కవలలు) ఉన్నారు. చంద్రశేఖర సాయి కిరాణా దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో ఇంటిలో సరిగా డబ్బులు ఇవ్వటంలేదన్న కారణంగా భార్యా భర్తల మధ్య తరచుగా వాగ్వివాదాలు జరిగేవి. ఈనేపథ్యంలో ఈనెల 2న భవాన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చినకాకానిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భవాని గురువారం సాయంత్రం మృతి చెందింది. భార్య మృతి వార్త తెలుసుకున్న చంద్రశేఖర సాయి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యాభర్తలు ఇరువూరు మృతి చెందటంలో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది.

హత్య కేసులో నిందితురాలు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి: హత్య కేసులో నిందితురాలిని రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం గతనెల 30న అర్ధరాత్రి తనతో సహజీవనం చేస్తున్న గద్దె రామును తన్నీరు ఆమని గొంతు కోసి హతమార్చింది. దాదాపు మూడేళ్లుగా సహజీవనం చేస్తున్న ఆమనికి రాముతో ఇటీవలి కాలంలో వివాదం నెలకొంది. దీనిపై నిత్యం గొడవపడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో రామును హతమార్చింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఆమనిని అరెస్ట్ చేసి గురువారం కోర్టుకు హాజరుపరచగా, న్యాయమూర్తి ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించారు.



సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-అచ్చంపేట

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని పెదపాలెంలో గురువారం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దీని నిర్మించడం ద్వారా లోవోల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉంటుందని, నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. క్రోసూరు, దొడ్లేరు, అచ్చంపేట సబ్ స్టేషన్ల మీద లోడ్ తగ్గి ఈ ప్రాంత ప్రజల విద్యుత్ కష్టాలు తీరతాయన్నారు. రూ.4 కోట్ల అంచనాలతో 5.2 కిలోమీటర్ల మేర 33 కవీ లైన్, 10.3 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఆధికారులను ఆదేశించారు. పెదపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో పెదపాలెంతో పాటు మిట్టపాలెం, నిండుజర్ల, కొండూరు, వేల్పూరు, గ్రంథసిరి, అచ్చంపేట జగనన్నకాలనీ ప్రాంతాల విద్యుత్ కష్టాలు తీరతాయన్నారు. భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్లకు కూడా ఇక్కడి నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు.

గుడిపూడి తిరునాళ్లలో వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



మండలంలోని గుడిపూడిలో మాతృశ్రీ అచ్చమాంబ పుల్లయ్యస్వామి దేవాలయంలో సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా వారు పొంగళ్ళు పొం గించారు. మేళతాళాలతో, బాణా సంచా కాల్చుతూ ఊరే గింపుగా కావడిని వై వి ఆంజనేయులు దంప తులు స్వయంగా మోసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. రైతులు పం టలు పండి సంతోషంగా వుండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి నేతలు, గ్రామస్తులు ఈ సందర్భంగా వైవి ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఎల్.గజానన, జి.అప్పారావు, కె.పుల్లారావు, కె.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'హెల్దీ నరసరావుపేట' పేరిట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ కళ్యాణ మండపంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. చంద్ర, ప్రమీల నల్లపాటి ఫౌండేషన్ అనుబంధ సంస్థ నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నలపాటి రామచంద్ర ప్రసాద్ (రాము) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిపి, షుగర్, కీళ్లు, కళ్ళు, గుండె, దంత, గైనిక్, ఈ.సి.జి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రక్త దాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, పట్టణ,పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిలకలూరిపేటలో సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్న చిన్నారి యోక్షిత సాయి తల్లిదండ్రులు, తన్నీరు ఓర్సు ఉమాదేవి, మహబూబ్ సుభాని, కంబగిరి పేరిరెడ్డి, సమీన్ పర్వానా

ఆరోగ్య సమస్యలపై సిఎంకు వేడుకోలు

- ఐదుగురు బాధితులకు రూ.లక్ష చొప్పున సాయం
- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర లోతేటి వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా చిలకలూరి పేట పర్యటనకు ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమానికి వచ్చిన ముఖ్య మంత్రి దష్టికి 5 గురు బాధితులు తమ అనారోగ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్థిక సహకారం, ఉపాధి అవకాశాలను కల్పించాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ వారిని తక్షణం ఆదుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటిని ఆదేశించారు. సి.ఎం. ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బాధితులను జిల్లా కలెక్టరేట్ కు పిలిపించి మాట్లాడారు. బాధితులకు తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున 5 గురికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం చేసి మానవతను చాటుకున్నారని గురువారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు.ఈ మేరకు కలెక్టరేట్ లో మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు బాధితులను కలెక్టరేట్ కు పిలిపించి బాధితుల అనారోగ్య కారణాలు, పడుతున్న ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారం అందిస్తూనే అవసరమైన వైద్య సేవలు పొందేందుకు తగిన సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ వెల్ల డించారు.

గుండెకు రంధ్రంతో భారీ ఖర్చు

చిలకలూరిపేట నియోజక వర్గం, కనపర్రు గ్రామానికి చెందిన తన్నీరు ఓర్సు ఉమాదేవి తాత వెంకయ్య తన మనవరాలు పుట్టుకతోనే గుండెకు రంధ్రంతో అన్నం తినే సమయంలో అన్నవాహికకు అడ్డం పడుతుందని వాపోయారు. తమకు ఎటువంటి స్థిర,చర ఆస్తులు లేవని,ఉన్న దాంట్లో ఇప్పటి వరకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశామని తెలిపారు. ఏడాదికి సుమారు రూ.24 లక్షలు ఖర్చు అవుతుందని వాపోయారు.

సొరియాసిస్‌తో బాధపడుతున్నా

చిలకలూరిపేట నియోజక వర్గం, ఏలూరు కు చెందిన పటాన్ మహబూబ్ సుభాని తనకు చిన్నప్పటి నుంచి సొరియాసిస్ అనే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు ముఖ్యమంత్రి కి తెలిపారు. తనకున్నసమస్యను పరిష్కరించడంతో పాటు కుటుంబ జీవన విధానం బాగుపడేందుకు తగిన ఉపాధి చూపించాలని ముఖ్య మంత్రికి విన్నవించారు.

చిన్నారికి కాలేయ వ్యాధి

చిలకలూరిపేట పట్టణం 18వ వార్డుకు చెందిన అనురాధ, వెంకటేష్ దంపతులకు ఏడాదిన్నర పాప (అంకమ్మ యోక్షిత సాయి) ఉందని, పాప పుట్టినప్పటి నుండి కాలేయ వ్యాధితో ఇబ్బంది పడుతూ ఉందని ముఖ్యమంత్రి ముందు వాపోయారు. పాపను పలు ఆస్పత్రులలో చికిత్సలు అందించినప్పటికీ, హైదరాబాదులోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పటల్ నందు సమస్య నయమవుతుందని చెప్పడంతో అక్కడికి వెళ్లి పాపకు వైద్యం చేపించామని, కాలేయ మార్పిడి ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని, ఇందుకోసం లక్షల్లో చికిత్సకు ఖర్చవుతుందని తెలియజేయడంతో బాధితులు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆశ్రయించారు.

బాలుడిని కాపాడండి

నరసరావు పేట కు చెందిన సమీన్ పర్వానా అనే మహిళ తన ఏడేళ్ళ బాలుడు సుభానికి జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తీసుకువెళ్ళానని, ఆ డాక్టర్ ఇచ్చిన మందులు వేసుకోవడం వలన తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని తెలి పారు. అక్కడి నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి అనేక ప్రముఖ వైద్య శాలలకు తీసుకు వెళ్ళినా నయం కాకపోగా ఐ.సీ,యూ లో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ పరి స్థితుల్లో ఉన్నాడని తల్లిదండ్రులు వాపోయారు.

ప్రమాదంలో గాయపడి....

పల్నాడుప్రాంతానికి చెందిన కుంబగిరి పేరిరెడ్డి డిసెంబరు 30 వ తేదిన ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న సమయంలో కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి కింద పడిపోయానని ముఖ్య మంత్రి కి విన్నవించుకున్నారు. ఆరోగ్యం మెరుగు పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని వాపోయారు. ఎంత వైద్య చికిత్స చేయించుకున్నా తలకు, పొట్టకు తీవ్ర గాయం అయ్యి కోలుకోలేక పోతున్నానని ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని ఆదుకోవాలని వేడుకున్నారు. దీంతో స్పందించిన ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మెరుగైన వైద్య సేవలను అందిస్తామని భరోసా కల్పించారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు తక్షణ సాయంగా బాధితునికి రూ.1 లక్ష ఆర్థిక సాయాన్ని కలెక్టర్ అందజేశారు.

అరుదైన విధానంలో స్టెంట్ అమరిక

మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఘనత

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో మొదటి సారిగా అత్యాధునిక రోటాబ్లేషన్ (రోటాప్రో) విధానం ద్వారా స్టెంట్ ల అమరికకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట లోని మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వేదికగా నిలిచింది. చికిత్స పొందిన నరసరావుపేట మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన 65 ఏళ్ల ఖాసీంబీ ఆరోగ్యం మెరుగుపడి ఇంటికి వెళుతున్న సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ కరసాని శ్రీనివాసరెడ్డికి బాధిత మహిళతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కరసాని మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం గుండె నొప్పితో వచ్చిన మహిళకు యాంజియో గ్రామ్ చేయగా మొదట వేసిన స్టెంట్లు రెండు బాగున్నాయని గ్రహించామన్నారు. 2 స్టెంట్లు వేయించుకున్న బాధితులలో దీర్ఘకాలం లో మళ్ళీ గుండెల్లో నొప్పి వస్తే బైపాస్ చేయాల్సి ఉంటుందని బాధిత కుటుంబ సభ్యుల కోరిక మేరకు చేపట్టిన అత్యాధునిక చికిత్స కొన్ని గంటల పాటు చేసి విజయవంతంగా పూర్తి చేశా మన్నారు. చికిత్స అనంతరం బాధిత సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ కారసాని తెలిపారు.



డాక్టర్ ను అభినందిస్తున్న ఖాసీంబీ

ఆసరా వేడుకలకు గ్రామైక్య సంఘాల నుంచి వసూళ్లు

- అచ్చంపేట మండలంలో ఘటన
- ఎపిఎం సలీంబాబుపై ఆరోపణలు

ప్రజాశక్తి - అచ్చంపేట

అవినీతికి తావు లేదంటూ చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామైక్య సంఘాల వద్ద డబ్బులు వసూలు చేసి ఆసరా వేడుకలు నిర్వహించింది. ఈ ఘటన అచ్చంపేట మండలంలో చోటుచేసుకుంది. గత మార్చి 31వ తేదీన ఆసరా మూడో విడత కింద మండలంలో 975 గ్రూపులకు 6 కోట్ల 44 లక్షల రూపాయలను డ్వాక్రా సంఘాలకు చెక్కును స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహణకు లక్ష రూపాయల వరకు ఖర్చు అయింది. దీని కోసం ఒక్కొక్క యానిమేటర్ దగ్గర రూ.2,000ను ఇన్‌ఛార్జి ఎపిఎం సలీంబాబు వసూలు చేసినట్లు సమాచారం. మండలంలో 43 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క దాని దగ్గర నుండి రూ.2000 చొప్పున రూ. 86, 000 వసూలు చేశారని యానిమేటర్లు ఆరోపించారు. అంతేకాకుండా, మహిళలను ఇరవై గ్రామాల నుండి అచ్చంపేటకు తరలించేందుకు రూ.2 వేలు ఖర్చయినట్లు యానిమేటర్లు చెప్పారు. గత ప్రభుత్వం తమ హయాంలో గ్రామైక్య సంఘాల సభ్యులకు రూ. 1500 వేతనంగా ఇచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వం వారికి పది వేల రూపాయల చొప్పు ఇస్తోంది. ఈ క్రమంలో కార్యాలయంలో ఎటువంటి కార్యక్రమాలు జరి గిన తమ వద్ద నుండి నగదు వసూలు చేస్తున్నారని యానిమేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట మండలానికి ఎపిఎం లేకపోవడంతో క్రోసూరు మండ లానికి చెందిన సలీం బాబును ఇక్కడ ఇన్‌ఛార్జిగా నియ మించారని, మండలంలో గ్రామైక్య సంఘాలలో మహిళలే ఉండాలని, మగవారు ఉండకూడదని ఎపిఎం చెబుతున్నా రని, ఉన్నతాధికారుల పేరు చెప్పి నగదు వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

డబ్బు వసూలు చేయలేదు

ఈ ఘటనపై ఎపిఎం సలీంబాబును వివరణ కోరగా ఆసరా వేడుకలకు ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేసిందని అన్నారు. ఆసరా వేడుకలకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని, గ్రామైక్య సంఘాల నుండి రూ.2, 000 ఇవ్వమని కోరామే తప్ప, డబ్బు వసూలు చేయలేదని అన్నారు. గ్రామైక్య సంఘాలు, డ్వాక్రా మహిళల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై మండలంలో విచారణ జరుపుతున్నామని, వారు ఈ విధంగా తనపై అసత్య ఆరోపణ చేస్తున్నారని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ 14 నుండి వామపక్షాల ప్రచారోద్యమం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజ్యాంగా నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి రోజు ఈ నెల 14 నుంచి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారోద్యమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. సిపిఎం సమావేశం గురువారం రాత్రి మేకా అమరారెడ్డి భవన్‌లో కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడంతో పాటు మతోన్మాద విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. ఈ కాలంలో అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ విధానాలు అవలంభించడంతో పాటు జిఎస్‌టి పేరుతో ప్రజలపై భారాలు మోపుతుందని మండిపడ్డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాద సంస్కృతి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఆదానీ కుంభకోణం దేశాన్ని కుదిపేస్తున్నా మోడీ నోరు మెదపడం లేదన్నారు. తనకు నచ్చని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఈడి, సిబిఐ లాంటి దర్యాప్తు సంస్థలను వినియోగించి రాజ్యాంగాన్ని మంట గలుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు, పోలవరం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించాల్సిన రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు బిజెపి పట్ల మెతకవైఖరి అవలంభించడం క్షంతవ్యం కాదన్నారు. ఫాసిస్టు విధానాలను అవలంభిస్తోన్న బిజెపి దేశంలో ఎవ్వరినీ బతకనివ్వదని, రాష్ట్రంలోని మూడు పార్టీలు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరుకు కలిసి రావాలన్నారు. మైనార్టీలు, దళితులపై దాడులు జరుగుతున్న ప్రతిపక్షాలు మాట్లాడ్కపోవడం ప్రజలు క్షమించరని చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా మూడు వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేస్తామని హామీనిచ్చిన ప్రధాన మంత్రి మాట తప్పారని, ఆ స్థాయికి ఇది తగదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రధాన పక్షాలు ప్రత్యేక హోదా, విభజన హామీలపై నిలదీయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఆందోళనల్లో కలిసిరావాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై సిపిఎం నాయకులు మరింత చొరవ చూపాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పంచాయతీకి పన్ను బకాయిలు లేవు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను బకాయిలను ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెల్లించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. పన్నులు చెల్లించలేదని కొంత మంది తమపై ఫిర్యాదులు చేయడాన్ని గురువారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. 2023 మార్చి వరకు ఉన్న బకాయిలు 31వ తేదీన డిడిల రూపంలో సంబంధిత శాఖకు చెల్లించామని వివరించారు. కొంత మంది పనిగట్టుకుని తమ యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే విధంగా జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. పన్నులు చెల్లింపులో ఎలాంటి జాప్యం చేయలేదన్నారు. 2022-23 వరకు ఉన్న పెండింగ్ బకాయిలను పంచాయతీరాజ్‌శాఖకు చెల్లించామని వివరించారు. ప్రస్తుతం ఎటువంటి బకాయిలు లేవన్నారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

ప్రజాశక్తి-తాడేపల్లి

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంటిఎంసి పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులను ఏప్రిల్ 30వ తేదీలోపు ఐదు శాతం రాయితీతో చెల్లించవచ్చని ఎంటిఎంసి కమిషనర్ యు.శారదాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థలోని యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అశాస్త్రీయ భావాలను విడనాడితే అభ్యున్నతి

ప్రజాశక్తి-గుంటూరు

అశాస్త్రీయ భావాలు వీడినప్పుడే సామాజిక అభ్యున్నతి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ గుంటూరు రెవెన్యూ భవనంలోని జొన్నలగడ్డ జోషి ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. సభకు పూలే, పెరియార్, అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ అధ్యక్షత వహించారు. హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రశ్నించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ సంస్కృతిపై స్పందించే స్థితిలో అధికార,ప్రతిపక్షాలు లేవన్నారు. హేతుబద్ధంగా ఆలోచించేవారు ఎక్కువ కాలం జీవిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించాలన్నదే పెరియార్ ఆలోచనా విధానమన్నారు. అనుభవంలోంచి పరిణతి చెందిన మహోన్నత వ్యక్తి పెరియార్ అని అన్నారు. సభలో రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.దేవరాజ్, బండారు సురేష్, గోలి మధు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

ఘనంగా చిప్స్ కాలేజి వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో 18వ వార్షికోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. అమెరికాలోని పిరమాల్ ఫార్మా సొల్యూషన్స్‌లోని ఆర్ అండ్ డి సీనియర్ మేనేజర్ డాక్టర్ పెండ్యాల రామారావు విచ్చేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫార్మసీ విద్యలో పట్టభద్రులైన తదుపరి కొంతమంది విద్యార్థులు తమ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఫార్మాసియేతర కోర్సులపై ఆసక్తి చూపటం ఆశ్చర్యంగా అనిపిస్తుందని, ఇది ఒక రకంగా అనాలోచిత నిర్ణయం అన్నారు. భవిష్యత్ జీవ ఆరోగ్య అవసరాలకు ఈ ఫార్మసీ విద్య దోహదపడుతుందని, అలాగే దేశ విదేశాల్లో ఉద్యోగావకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని, మున్ముందు ఆ అవకాశాల పరిధి మరింత విస్తృతం కాబోతుందని అన్నారు. కనుక అనాలోచిత నిర్ణయాలతో, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే ఫార్మసీ విద్యకు దూరం కావద్దని సూచించారు. హైదరాబాద్‌లోని సౌత్‌జోన్ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రామ్ కిషన్ మాట్లాడుతూ ఫార్మసీ పారిశ్రామిక రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, అందులోనూ ముఖ్యంగా ఫార్మసీ రెగ్యులేటరీ విభాగంలో బి.ఫార్మసీ, ఫార్మాడి విద్యార్థులకు ఎన్నో మంచి అవకాశాలతోపాటు, పరిశోధనా ఆసక్తి ఉన్న విద్యార్థులకు చాలా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ టి.వి.నారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారత ఫార్మారంగ ఉత్పత్తులు బాగా ఎగుమతి అవుతున్నాయని, విజన్ 2030 ద్వారా మన దేశ ఔషధ రంగానికి మహర్దశ రానున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ జనరల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, కళాశాల కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ, గోపీంద్, తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పలు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

కార్మిక దిగ్గజం బిటి రణదివెకు ఘన నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి

కార్మిక వర్గం ఐక్యత కోసం పరితపించిన యోధుడు బిటి రణదివె అని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఘనంగా నివాళులర్పించారు. కార్మిక వర్గ నాయకుడు బిటి రణదివె 33వ వర్ధంతి గురువారం ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సిఐటియు తొలి జాతీయ అధ్యక్షులుగా, తొలి కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరిగా రణదివె నిలిచారన్నారు. అనేక కార్మిక వర్గ పోరాటాలకు ఆయన ఆధ్యుడిగా నిలిచారని చెప్పారు. 86 సంవత్సరాల జీవించిన ఆయన జీవితాంతం కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం పోరాడారన్నారు. సిఐటియు ఆవిర్భావం సందర్భంగా 1974లో కలకత్తాలో ఆయన చేసిన ప్రసంగం నేటికీ ఐక్యతా పోరాటం నినాదంగా మారు మోగుతుందని తెలిపారు. అనేక నిర్బంధాలు, జైలు జీవితం గడిపినా తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా వెనకడుగు వేయలేదని శ్లాఘించారు. ఆయనతో పాటు భార్య, చెల్లెలను కూడా కార్మికోద్యమ బాటలో పయనింపజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకలు బూరుగ వెంకటేశ్వర్లు, కె.లక్ష్మి, బి.ప్రభాకర్, నాని, కొండయ్య, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



రేపు కెవికె కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని డాక్టర్ కొలచల వెంకట కృష్ణమూర్తి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎస్.వి ప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 1958 నుండి నేటి వరకు కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరి దేశ విదేశాల్లో స్థిరపడ్డ వారు, అలాగే విశ్రాంత జీవితం గడుపుతున్న పండితులు పలువురు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వారు రచించిన 800 పేజీల సంపూర్ణ సాహిత్య సంపుటి 'కొత్త గోదావరి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. వివరాలకు 94935 01306 నంబర్ కు సంప్రదించాలని ప్రసాద శర్మ ఒక ప్రకటనలో తెలియజేశారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు



వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన విద్యార్థి పవన్‌కుమార్‌రెడ్డి యేరువకి విజ్ఞాన్ యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వర్సిటీ వీసీ కార్యాలయం తెలిపింది. సింథటిక్ యుటిలిటీ ఆఫ్ బీటా-నైట్రో స్టైరిన్ డెరైవ్డ్ ఎంబీహెచ్ (బీటా-ఎన్ఎస్ ఎంబీహెచ్) అడక్ట్స్ టువర్డ్స్ ద కన్‌స్ట్రక్షన్ ఆఫ్ 1,3-ఇండేనీడయోన్ స్పైరోప్యారన్స్, పైరాజోలోనే స్పైరోప్యారన్స్, టెట్రాహైడ్రో క్రోమేన్స్ అండ్ డైహైడ్రోనాఫ్తోఫ్యూరన్స్' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశాడు. వర్సిటీలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ అన్వర్ గైడ్‌గా వ్యవహరించారు.



బీమా చెక్కు అందచేస్తున్న బ్యాంకు అధికారులు

బాధితుడి కుటుంబానికి ఎస్‌బిఐ రూ.20 లక్షల బీమా

ప్రజాశక్తి-గుంటూరు :ఎస్‌బిఐ వ్యక్తిగత ప్రమాద బీమా ఒక కుటుంబానికి అండగా నిలిచిందని బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎ.తారకేశ్వ రారవు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యి రూపాయాలతో తీసుకున్న వ్యక్తిగత బీమా ప్రమాదవశాత్తూ ఆ వ్యక్తి మరణించటంతో ఆ కుబుంబానికి అండగా ఎస్‌బిఐ రూ.20 లక్షలు బీమా పరిహారాన్ని అందించినట్లు చెప్పారు. గుంటూరు నగరానికి చెందిన పెద్ది వెంకటేశ్వరరావు రూ.1వెయ్యితో బీమా చెల్లించారని తెలిపారు. ప్రమాద వశాత్తు ఆయన మృతి చెందారని, బీమా సొమ్ము కుటుంబ సభ్యులకు రూ.20లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు ఆనంద్, ఎస్‌బిఐ ట్రెజరీ చీఫ్ మేనేజర్ ఎ.అమరేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

ముగ్గురోడ్డులో ఇదేం ఖర్మ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 14వ వార్డు ముగ్గురోడ్డులో గురువారం సాయంత్రం ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుల వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ పేదలు ఎక్కువగా నివశిస్తున్న ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కానరావడంలేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. కొండ ప్రాంత వాసులకు మంచినీరు అందడంలేదన్నారు. ఈ ప్రాంతంలో ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డి.దాసు, ఎ.ప్రసాద్, మురళీ, బి.రామకృష్ణారావు, చాంద్‌బాషా, అన్నెం కుసుమ తదితరులు పాల్గొన్నారు.



సామాన్యుడికి.. 'సన్న బియ్యం' అందనిద్రాక్షేనా!

- రేషన్ షాపులో సన్న బియ్యం ఇవ్వరు
- బియ్యం దుకాణాల్లో కొనలేని పరిస్థితి
- బియ్యం ధరలు తగ్గించాలని సామాన్యుల వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రేషన్ షాపుల నుంచి పెదలకు సన్న బియ్యం సరఫరా చేస్తామని గతంలో ప్రభుత్వం చెప్పింది. తరువాత మాట మార్చి సన్న బియ్యానికి బదులు నాణ్యమైన బియ్యాన్ని అందిస్తామన్నారు. ఎప్పటిలాగే బియ్యం సరఫరా చేస్తున్నారు. అవైనా తిందా మంటే కేజీ పది రూపాయల చొప్పున ఇస్తున్నారంటున్నారు. బయట దుకాణాల్లో కిలో రూ. 58 కు బియ్యం కొనలేక తిన లేకపోతున్నామని సామాన్యులు వాపోతున్నారు. నెల లోనే కిలోకి పది నుంచి పదిహేను రూపాయల ధరలు పెరిగాయని చెబుతున్నారు. చిలకలూరిపేట పట్టణంలో వివిధ రకాల బ్రాండ్ల పేర్లతో బియ్యం అమ్మకాలు సాగిస్తున్నారు. గత మూడు నెలల కాలంలోనే సన్న బియ్యం (మసూరి, బి.పి.టి. బియ్యం) ధరలు కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగాయి. ప్రస్తుతం కర్నూలు సోనా మసూరి నెంబర్ వన్ రకం బియ్యం కిలో రూ.56కు విక్ర యిస్తున్నారు. ప్రీమియం, న్యూ ప్రీమియం అనే పేర్లతో రెండో రకం బియ్యం ధర కిలో రూ.50 నుంచి రూ.52 వరకు,మూడో రకం బియ్యాన్ని రూ.46, రూ.48 వరకు విక్రయిస్తున్నారు.పలు ప్రత్యేక సందర్భాల్లో, శుభకార్యాల సమయంలో వంటకాల నిమిత్తం వినియోగించే బాస్మతి, ఇతర మేలు రకం బియ్యం ధం కిలో రూ. 120 నుంచి రూ.150 వరకు ఉంది. చివరికు నాసిరకం బియ్యం, నూకలు సైతం కిలో ధర రూ.30 నుంచి రూ.40కు విక్రయిస్తున్నారు. మూడేళ్ల క్రితం సోనా మసూరి, బిపిటి కిలో ధర రూ.32. ఇరవై ఐదు కిలోల బస్తా ధర రూ.800 ఉండేది. ఆ తర్వాత బస్తా ధర రూ.900 వందలు పలికింది. ప్రస్తు తం రూ.1400గా ఉంది. కిలో ధర రూ. 56 పలుకుతోంది. బస్తా కాకుండా విడిగా కొనుగోలు చేస్తే కిలో ధర రూ. 58 తీసు కుంటున్నారు. ధరలు పెరుగుదలను పరిశీలిస్తే సామాన్యులు సన్నరకం బియ్యం కొనాలంటే ఆలోచించే పరిస్థితి నెలకొంది. సన్న బియ్యం ధర పెరగడానికి మిల్లర్లు, మధ్యవర్తులే కారణమని వ్యాపారులే చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల వరి సాగు తగ్గిపోయిందని, దీంతో బియ్యం రేట్లు పెరుగుతున్నాయనే వాదన లేకపోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే బాస్మతి బియ్యం తరహాలో సన్న బియ్యం ధర పెరిగిపోతుందేమోననే వారు లేకపోలేదు.

రేషన్ షాపులో సన్నబియ్యం ఇవ్వాలి

రంగులు వేసి జీవనోపాధి వెళ్లదీస్తున్న ఎం.విల్సన్ మాట్లాడుతూ రోజుకు రూ. 600 సంపాదిస్తానని, నెలలో 25 రోజులు మా త్రమే పని ఉంటుందని చెప్పాడు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం, నిత్యావసరాలు, గ్యాస్ ధరలు పెరిగి పోవడంతో బతుకువెళ్లదీయడం కష్టంగా ఉందన్నాడు. 25 కిలోల బిపిటి బియ్యాన్ని రేషన్ షాపులో రూ.800 లేదా రూ.900 కు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

నూకలు వండుకు తింటున్నాం

పూల కొట్లో గుమాస్తాగా పనిచేస్తున్న తానూరు రమేష్ మాట్లాడుతూ రోజుకు రూ.350 కూలి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం నెలకు చాలవని అన్నారు. బయట దుకాణాల్లో బియ్యం ధరలు చూస్తే కొనలేని పరిస్థితి ఉందన్నారు. బియ్యం కొనలేక నూకలు వండుకుని తింటున్నామని చెప్పారు. నూకల కిలో ధర రూ.35 గా ఉందని అన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దళిత కాలనీలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు, మెరుగైన వనరులు, వసతులు కల్పించేందుకు వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని చేస్తుందని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రూరల్ మండలం కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు అన్నారు. సత్తెనపల్లి మండల ధూళిపాళ్ల పంచాయతి పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం(కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ యార్డు చైర్మన్ రాయపాటి పురుషోత్తం ముఖ్యఅతిథిగా పాల్గొని శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో రూ.20 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వం నిధుల, మరో 20 లక్షలు ఎమ్మెల్యే నిధుల నుండి మంజూరు చేశారని, వీటితో భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో సర్పంచ్ కె.మహాలక్ష్మి,ఎంపిటిసి కుంభా వీరమ్మ. వైసిపి నేతలు చిలకా జయపాల్ పాల్గొన్నారు.



వైభవంగా గుడిపూడి తిరునాళ్ళ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం నందిగామ గుడిపూడి తిరునాళ్ళ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాతృశ్రీ అచ్చమాంబ పుల్లయ్య స్వామి తిరునాళ్ళ మహోత్సవం గుడిపూడి, నందిగామ గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రజలు తిరునాళ్ళ తిలకించేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. పొంగళ్ళు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. తొలినాళ్ళ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు తిరునాళ్ళ ను పురస్కరించుకుని బంధువులను స్నేహితులను విందుకు గ్రామస్తులు ఆహ్వానించారు. రాజకీయ పార్టీల నాయకులు భారీ విద్యుత్ ప్రభలను ఆర్కెస్ట్రాలను ఏర్పాటు చేశారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక శ్రీ చంద్రమౌళిశ్వర స్వామి ఆలయ 7వ వార్షికోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు జూనూతుల నరసింహమూర్తి, ప్రశాంత్ శర్మ ల ఆధ్వర్యంలో స్వామి వారికి గురు ప్రార్థన గణపతి పూజ, పుణ్యాహవాదినము,రక్షాబంధనము, సర్వతోభద్ర మండల పూర్వక మండపారాధన,షోడశోపచార పూజ, ఏకాదశ రుద్ర కలశావాహన, మహా నివేదనం, నీరాజనం మంత్రపుష్పం వంటి పూజలు చేశారు.కలశ ఉద్వాసన గురువులచే కుంభాభిషేకం ఘనంగా జరిపారు.అనంతరం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నేటి నుంచి జాతీయ స్థాయి ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-మాచర్ల

శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహోత్స వాల సంద ర్భంగా వైసిపి రైతు విభాగం ఆధ్వ ర్యంలో పట్టణంలో జాతీ య స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేలు శుక్రవారం నుండి నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మరుమాముల శ్రీనివాసశర్మ (984866 28 15), పోలా శ్రీనివాసరావు (9440263347) తెలిపారు. స్థానిక నెహ్రూనగర్ లోని కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా ఈ పోటీలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఎద్దుల బండలాగు పందేలను 5 విభాగాలలో నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వాటికి పెద్ద మొత్తాల్లో బహు మతులు అందజేయనున్నట్లు తెలిపారు. 7వ తేదీ నుండి జరిగే పం దేలలో 4 పళ్ళ విభాగం, 8వ తేది 6 పళ్ళ విభాగం, 9వ తేది సేద్యం విభాగం, 10వ తేదీ జూనియర్స్ విభాగాల మధ్య పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ప్రారంభ వేడుకల్లో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, పిన్నెల్లి వెంకట రామిరెడ్డి పాల్గొం టారని తెలిపారు.

మద్యంపై రూ.41 వేల కోట్ల దోపిడీ : జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-నరసరావుపేట



పచ్చని కాపురాల్లో కల్తీ మద్యం చిచ్చు పెట్టిన వైసిపి, వారి మ్యానిఫెస్టోలో విడతల వారిగా మద్యపానం నిషేధమని చెప్పి నాణ్యత లేని కల్తీ తయారు చేసి మూడున్నరేళ్లలో మద్యం లోనే రూ 41 వేల కోట్లు దోచుకున్నారని టిడిపి పల్నాడు అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు విమర్శించారు. స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. ఎన్నికల సమయంలో మద్యపాన నిషేధం అని చెప్పి మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం బినామీల ద్వారా కల్తీ, నాసిరకం మద్యం సరఫరా చేయడంతో ప్రజారోగ్యానికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. అవినీతి చేయడం కోసమే ఆన్లైన్ పేమెంట్ తీసుకోవడం లేదని, మద్యం అమ్మకాలపై సిబిఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారన్నారు. ఎపి మద్యం బ్రాండ్లు హానికరమని, ఇతర రాష్ట్రాలలో వీటిని నిషేధించారని చెప్పారు. గనులు, ఇసుక, మద్యం దోపిడీలలో రాష్ట్రం ముందుందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎం.దారు నాయక్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మైనారిటీ నాయకులు మాబు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలిన ఎమ్మెల్యే: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అవినీతి,అక్రమాల పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని నరసరావుపేట నియోజకర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని 32 వ వార్డ్ బరంపేట ప్రాంతంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు.

అరవిందబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రజా సంక్షేమం గాలి కొదిలి సొంత సంక్షేమం పై దష్టి సారించారని ఎద్దేశాచేశారు. 4 ఏళ్ల వైసిపి పాలనలో నియోజవర్గంలో గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేసిన అవినీతి, అరాచకాలకు లెక్క లేదన్నారు. నియోజకవర్గంలో జరిగే ప్రతి పనిలో ఎమ్మెల్యేకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. అధికారాన్ని అడు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి రూ కోట్ల సంపాదించాడని ఆరోపించారు..ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి యువతకు ఉద్యోగ అవకాశాలు టిడిపి ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి 32 వార్డు నాయకులు షేక్ అబ్దుల్ గఫార్,ఆకుల కిషోర్, పల్లబోతు ప్రసాద్,తోట సాంబశివరావు, కొల్లి నరసింహారావు, మువ్వల రవీంద్ర,అశోక్ కుమార్,షేక్ రహీమ్,షేక్ జానీ బాషా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బరంపేటలో నిర్వహించిన ఇదేం ఖర్మలో పాల్గొన్న టిడిపి నాయకులు

సిబిఐ ని సరైన దారిలో పెట్టేందుకు కొత్త చట్టం తేవాలి

'అవగాహన' డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

ఎవరి ఒత్తిళ్లకు లోను కాకుండా, స్వతంత్ర సంస్థగా, కార్యనిర్వాహక స్వయం ప్రతిపత్తితో సిబిఐ పనిచేసే విధంగా కేంద్రం ఒక కొత్త చట్టం తీసుకురావాలని అవగాహన సంస్థ డిమాండ్ చేసింది. 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' అంటూ ఒకప్పుడు పరువు పోగొట్టుకున్న సిబిఐ ని ఇప్పటికీ అధికార పక్షాల నమ్మిన బంటుగా ప్రజాబాహుళ్యం ఇప్పటికీ భావిస్తోందని పేర్కొంది. సిబిఐ పని తీరు ఎప్పటికప్పుడు పెను విమర్శల పాలవుతోందని, సంచలనాత్మక రాజకీయంగా సున్నితమైన కేసుల్లో న్యాయ సమీక్షా ప్రమాణాలను అందుకోవడంలో సిబిఐ విఫలమౌతోందని విమర్శించింది. రాజకీయ రాగ ద్వేషాలకు అతీతంగా అక్రమార్కులకు అర దండాలు వేయడంలో సిబిఐ సంస్థ విశ్వసనీయత పాతాళపు లోతులకు చేరిందని తత్ఫలితంగానే తొమ్మిది రాష్ట్రాలు దానికి అనుమతులు నిరాకరించాయని అవగాహన సంస్థ విమర్శిస్తుంది. రాజకీయ సంకెళ్ల బారి నుండి విడివడి పార్లమెంటుకు, తద్వారా ప్రజలకు జవాబు దారి అయ్యేలా సిబిఐ ని సంస్కరించాలని అప్పుడే అది అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రధాన ఆయుధం అవుతుందనే వాస్తవాన్ని ప్రధాని మోదీ, ప్రభుత్వాలు గుర్తిం చాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

9న అవగాహన ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభలలో భాగంగా ఈ నెల 9న థైరాయిడ్, కొలెస్ట్రాల్, షుగర్, ఆస్టియో పొరాసిస్ వ్యాధులపై సభ ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 9వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఈ సభ జరగనున్నట్లు పేర్కొంది. ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ పద్మలత ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పలు సందేహాలను ఆమె నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. సభను రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ ప్రారంభిస్తారని, ఆరోగ్యాభిలాషులు పాల్గొనాలని కోరారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

130 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద గురువారం ఎన్‌టిఆర్ ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జ్వరం,గొంతు నొప్పి, తామర, చర్మంపై మచ్చలు, కళ్ళు తిరగడం, కఫం, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న 130 మందికి వైద్య బృందంచే పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఇంజక్షన్లు చేశారు. అలాగే రక్త పరీక్షలతో పాటు ఈసీజీ కూడా తీశారు. పలువురికి ఆరోగ్యం పట్ల సరియైన అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరంను నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసుకున్న వారి యొక్క ల్యాబ్ రిపోర్ట్స్ వారికి వాట్సాప్ ద్వారా పంపిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇప్పటికే 51 వేల మందికి ఉచితంగా వైద్య సహాయం అందించినట్లు డాక్టర్లు తెలిపారు.



చెక్క బల్లబండ్లను అందజేస్తున్న నాయకులు

చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఐదుగురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో గురువారం వైసిపి నాయకులు చెక్క బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, ఏ.రాజేష్, సంకే సునీత, ఎం. సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చేనేత కార్మిక సంఘం సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి- రూరల్

చేనేత కార్మిక సంఘం సమస్యలను పరిష్కరించాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి కోరారు. గురువారం ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం ఎపి చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌కు ఎర్రబాలెంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతుందని, ముఖ్యంగా ఈ పరిశ్రమ ఎక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాంతమైన సత్యసాయి జిల్లా ధర్మవరం ప్రాంతంలో ఆందోళనకరంగా ఉందని చెప్పారు.చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, మరమగ్గాలపై నిరంతరం తనిఖీలు చేపట్టి ఉల్లంఘనను ఆపాలని , ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్ ధర్మవరంలో ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు సబ్సిడీపై రా మెటీరియల్ అందజేయాలని, మార్కెట్ సపోర్ట్ ప్రైస్ ఇవ్వాలనీ, స్కిల్ సబ్సిడీ స్కీన్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు జి బాలాజీ, జిల్లా అధ్యక్షులు జి. వెంకట కృష్ణారావు, నియోజకవర్గ కార్యదర్శి డి.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.మోహన్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని సమన్వయంతో పూర్తి చేయాలి

హౌసింగ్ డిఇ కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డిఇ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

గ్రామ సచివాలయం సిబ్బంది సమన్వయంతో లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని హౌసింగ్ డిఇ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని జగనన్న కాలనీపై గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం కార్యదర్సులు, ఇంజనీరింగ్ సిబందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఓ మారుతి శేషమాంబ అధ్యక్షతన వహించగా హౌసింగ్ డిఇ కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని జగనన్న కాలనీలో 1872 జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని తెలిపారు. వివిధ గ్రామాలలో ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని కొన్ని గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావస్తున్నాయని పేర్కొన్నారు. తాగునీరు, వసతి టాయిలెట్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రావ్య, హౌసింగ్ డిఇ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కొత్త రకం మిరప విత్తనం



మాట్లాడుతున్న డాక్టర్ రోశయ్య

ప్రజాశక్తి - తాడికొండ

నూజివీడు సీడ్స్ వారు మార్కెట్లోకి ఎన్‌సిహెచ్ 6889 కొత్త మిరప హైబ్రిడ్ విత్తనాన్ని ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ శాస్త్రవేత డాక్టర్ రోషయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫణిదరంలో ఈ విత్తనాన్ని సాగుచేసిన రైతు కర్నాటి శ్రీనివాసరావు పొలంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ విత్తనం నల్ల తామర తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి సాధిస్తుందని తెలియజేస్తున్నారు పెట్టుబడి తక్కువగాఉంటుందని, ఎకరాకు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు గ్రామ రైతులతో సమావేశాన్ని నిర్వహించి మిరప విత్తనంపై అవగాహన కల్పించి క్షేత్ర పర్యటన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్ బాబు, శివ నాగేశ్వరరావు, తుమ్మల శ్రీధర్, నూజివీడు సీడ్స్ ఏజీఎం ఎన్ శ్రీనివాస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చెక్కను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

మూడో విడత ఆసర పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్: అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు కొండంత అండని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణ 25వ వార్డులో గురువారం ఏర్పాటు చేసిన వైయస్ఆర్ ఆసరా మూడో విడత నిధులను ఎమ్మెల్యే పాల్గొని పంపిణీ చేశారు. పట్టణ పరిధిలో 25 నుండి 29 వార్డుల్లో 2033 డ్వాక్రా సభ్యులకు రూ 1.61 కోట్ల చెక్కును అందజేసారు. మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, పురపాలక కమీషనర్ ఎం జస్వంతరావు వార్డు కౌన్సిలర్లు టి. రామయ్య, నూర్ ఇస్మాయిల్, యాతాటి అనిల్, కవితాబాయి, నాయకులు, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాలు అందజేస్తున్నట్రెజరర్ లావు ఆదిశేషయ్య

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

స్థానిక పిఎఎస్ కళాశాలో ఇంటర్మీడియట్ , డిగ్రీ చదువుతున్న డిజేబుల్డ్ విద్యార్థులకు సమర్ధనం ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఫర్ డిజేబుల్డ్ వారు రూ.53 వేలు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసినారు. గురువారం కళాశాల పాలకవర్గ ట్రెజరర్ లావు ఆదిశేషయ్య విద్యార్థులకు స్కాలర్షిప్ అమౌంట్‌ను అందచేసినారు. నేషనల్ వైడ్‌గా డిజేబుల్డ్ విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందిస్తున్న సమర్ధనం ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఫర్ డిజేబుల్డ్ గుంటూరు వారికీ కళాశాల పాలకవర్గం, ప్రిన్సి పాల్ వీరనారాయణ సూపర్నెంట్ దగ్గుబాటి లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు

మహిళల స్వయం ఉపాధే లక్ష్యం

ప్రజాశక్తి- మంగళగిరి

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్త్రీ శక్తి కార్యక్రమంను ప్రారంభించినట్లు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి తెలిపారు. గురువారం నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్‌లో కుట్టు మిషన్లు, ధృవీకరణ పత్రాలు ప్రధానం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలను తెలుగు మహిళ విభాగం నాయకులు అభినందించారు. ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో నారా లోకేష్ అందిస్తున్న కుట్టు మిషన్లు ఆదాయమార్గంగాను,



ధ్రుపత్రాలను అందజేస్తున్న నాయకులు

కుటుంబ అవసరాలను తీర్చేదివిగాను ఉంటుందన్నారు. కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానికీదేవి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, రాష్ట్ర కార్యదర్శి వి. ఆషాబాల, నియోజకవర్గ తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి ఎం. వైష్ణవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షురాలు ఎ.కుసుమ, మండల అధ్యక్షురాలు బి.కృష్ణ వందన, మండల ప్రధాన కార్యదర్శి జి. అనిత, కమిటీ నాయకులు పాల్గొన్నారు.



బ్రహ్మయ్యను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రేడియో ఆర్టిస్ట్ బ్రహ్మయ్యకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో గురువారం ఎన్టీఆర్ నటించిన సాహసవంతుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుణ్ణి సన్మానించే కార్యక్రమంలో పౌరాణిక, నాటక కళాకారుడు, రేడియో ఆర్టిస్ట్ ఆరమండ్ల బ్రహ్మయ్యను టిడిపి నాయకులు సోమవరపు సాంబశివరావు, ఉమ్మలనేని ధర్మారావు, చిన్ని కృష్ణచైతన్య, చిన్ని సంపత్, కొండూరు శివప్రసాద్ తదితరులు సత్కరించి ఎన్టీఆర్ శత జయంతి పురస్కారాన్ని అందించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు; డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, పెద్దిటి యోహాను, ఎన్ శ్రీనివాస్, ఎం వెంకట్ తదితరులు పాల్గున్నారు.



శంకుస్థాపన చేస్తున్న చల్లా రాజేంద్ర ప్రసాద్,ఎమ్మెల్యే ఆర్కే

ఫుట్ బ్రిడ్జ్‌లకు శంకుస్థాపన

ప్రజాశక్తి -దుగ్గిరాల

మండల కేంద్రంలో దుగ్గిరాలలోని సుగాని కాలనీ సమీపంలో కొమ్మమూరు కాలువపైన, మంచికలపూడి రోడ్డు వద్ద బకింగ్ హామ్ కాలువలు పైన నిర్మించి తలపెట్టి ఫూట్ బ్రిడ్జల నిర్మాణానికి గురువారం శంకుస్థాపనలు నిర్వహించారు. సిసిఎల్ కాఫీ ఫ్యాక్టరీ వారి ఆర్థిక సహాయంతో నిర్మిస్తున్న ఈ ఫూట్ బ్రిడ్జిలకు ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్,మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు కొబ్బరికాయలు కొట్టి శాస్త్రోత్తంగా శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పిటిసి మేకతోటి అరుణ, యాడ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్ బాణావత్ కుషి భాయ్, వైసిపి నాయకులు వెంకటేశ్వర నాయక్ కె. క్రాంతి కుమార్, షేక్ నాగూర్ , గాలం ఫణీంద్ర, గ్రామాల సర్పంచులు , జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేవస్థానంలో సామూహిక ధ్యానం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు సామూహికంగా ధ్యానం చేశారు. ఈ కార్యక్రమానికి ధ్యాన రత్న వెలగపూడి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రమం తప్పకుండా ధ్యానాన్ని ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆకురాతి శంకరరావు, వల్లభనేని వాణి, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు



విమర్శలకు కారణమైన ఫొటో

అవమానం అంటూ విమర్శలకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఖండన

ప్రజాశక్తి - నరసరావుపేట

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా వైద్య బృందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో దిగిన సందర్భంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పక్కనే నిల్చుని ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కలెక్టర్‌ను పక్కన నిల్చోబెట్టడం దళిత జాతికి అవమానమంటూ సోషల్ మీడియాలో పలువురు విమర్శలు గుప్పించారు. దీనిపై కలెక్టర్ తన కార్యాలయం నుండి గురువారం వీడియో ద్వారా స్పందించారు. ప్రొటోకాల్ పాటించకపోవడం ఏమీ లేదని, తనకు అవమానం జరిగిందనే కోణంలోనూ సోషల్ మీడియా ద్వారా పోస్టింగులు సరికాదని అన్నారు. సిఎం ఎక్కడికి వెళ్లినా సందర్భానుసారం ఇలా ఫొటోలు దిగుతుంటారని, ఇందులో అవమానాలకు తావు ఉండదని అన్నారు.

ట్రాఫిక్‌నకు అడ్డులేని ప్రాంతాలకు విగ్రహాలు

ప్రజాశక్తి-గుంటూరు



కొత్త ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

గుంటూరు నగరంలో ట్రాఫిక్‌నకు అడ్డుగా ఉన్న విగ్రహాలను గుర్తించి, అడ్డులేని ప్రాంతంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. వాటిని ఏర్పాటు చేసిన పెద్దలతో మాట్లాడి, వారి మనోభావాలు దెబ్బ తినకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నగరంలోని ఎత్తురోడ్డు సెంటర్‌లో కొన్ని దశాబ్దాల క్రితం మహాత్మ గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, వంగవీటి మోహన రంగా విగ్రహాలను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం నగరం విస్తరించి, వాహనాల రద్దీ బాగా పెరిగిందని అన్నారు. చిలకలూరిపేట, నర్సరావుపేట, ప్రత్తిపాడు, పర్చూరుకు వెళ్లి వచ్చే వాహనాలకు ఎత్తురోడ్డు జంక్షన్‌గా మారిందన్నారు. ప్రస్తుతం అవి ట్రాఫిక్‌నకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానిక పెద్దలతో మాట్లాడి ట్రాఫిక్‌నకు అంతరాయం లేని రోడ్డు మార్జిన్ ప్రాంతంలో ఏర్పాటుకు ఒప్పించగా, ఆ పనులను మేయర్ గురువారం పరిశీలించారు. విద్యాసంస్థల వెళ్లే బస్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకొని సకాలంలో వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని, ఆ విగ్రహాలను రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగరంలో ఇంకా ట్రాఫిక్‌నకు అడ్డుగా ఉన్న విగ్రహాలను గుర్తించి, స్థానిక పెద్దలతో మాట్లాడి, సదరు విగ్రహాలను ట్రాఫిక్‌నకు అంతరాయం లేని ప్రాంతంలో ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, పోలీస్ అధికారులు, నగర పాలక సంస్థ డిఇఇ రమేష్‌బాబు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఎడిహెచ్ రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రత్నకుమార్

ఆరోగ్యమైన ఆహారం అందరి హక్కు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అవగాహన పొందే హక్కును కల్పించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న కుమార్ అన్నారు. జిజిహెచ్‌లో మానసిక వైద్య విభాగం ఓపీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్క రించుకుని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె.రత్న కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, మంచి నీటిని పొందే హక్కు ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే బాధ్యత కలిగి ఉన్నప్పుడే ప్రతి పౌరుడూ ఆరోగ్యాన్ని సాధించ గలుగుతాడని అన్నారు. అనంతరం రోగులకు పండ్లు అందచేశారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, జిల్లా విభిన్నవంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.

సిఎం పర్యటన దృశ్యమాలిక



ప్రజాశక్తి – చిలకలూరిపేట